


ఆ ఉదయం పోస్టు జవాను తెచ్చిన జాబును గురించే నా ఆలోచన. జాబును పదేపదే చదివాను. చదివినపుడల్లా ఏదో నాకే తెలియని ఆవేదన. నా ఆవేదన ఎవరితో చెప్పను? ఆఫీసులో కూడా నా ధ్యాసంతా ఆ ఉత్తరం మీదనే. సాయంకాలం బీచ్‌కి నడిచాను, నా హృదయ భారం సముద్రుడయినా తీర్పగలడేమోనని. జనం అంతా చిందరవందరగా ఎవరికి తోచినట్టు వారు కూర్చున్నారు, నిల్చున్నారు, నడుస్తున్నారు, పరుగులెడుతున్నారు. ఒంటరులు, జంటలు, గుంపులు, రోజూ ఆ దృశ్యం చూడటం నా కెంతో యిష్టం. కాని, ఆ నాడు నా మనస్సు వాటిమీదకు పోనేలేదు. జనసంచారంలేని ఒక ఏకాంత ప్రదేశంలోనికి పోయి కూర్చున్నాను. మళ్లీ ఆ జాబునుతీసి చదివాను.

బి. విశ్వం


"హుం! లోకంలో అనుమానాలు ఎంతకు దారి తీస్తాయి" అనిపించింది. నిజమే! చిన్న చిన్న అనుమానాలే ఎన్నో యుద్ధాలుగా కూడా పరిణ మించాయి. ఎన్నో కుటుంబాలు నాశనమయాయి. నాలో ఆలోచన పరంపరలు అలా కదిలిపోతున్నాయి. ఇంతలో ఎవరో భుజం తట్టినట్టయింది. వెనుదిరిగి చూచాను. రమేష్.

నేను హైదరాబాదునుండి మద్రాసుకు ట్రాన్స్‌ఫర్ అయిన నాటినుండి ఈ సంవత్సరంలో రమేష్‌తో నాకు ప్రాణస్నేహం ఏర్పడింది. నా కష్ట సుఖాలు రమేష్‌తో దాచకుండా చెప్తాను. రమేష్‌కూడా తన బాధలు నాతో చెబుతాడు. సమయానికి తను అక్కడకు రావడం నాకు కొంత మనో ధైర్యాన్నిచ్చింది. "రమేష్! మంచి సమయానికి వచ్చావు. కూచో" అన్నాను. రమేష్ నా ఎదురుగా కూర్చున్నాడు. "ఏమిటి, సంగతి?" అని అడిగాడు.

"అనుమానాలు ఎంతకు దారి తీస్తాయి తెలుసా" అని అన్నాను. 'ఎంతకయినా దారితీస్తాయి' అన్నాడు రమేష్ చేతులు తిప్పుకుంటూ.

"అదికాదు రమేష్! నేను హైదరాబాదులో పనిచేసేవాడిని కదూ, ఆ రోజుల్లో జరిగిన సంఘటనలు నా మనస్సుని యిప్పుడు కలవరపరుస్తున్నాయి" అన్నాను.

"అసలు సంగతేమిటో చెప్ప



వోయ్" అన్నాడు రమేష్ కొంచెం విసుగ్గా.

"నేను హైదరాబాదులో ఉన్న రోజుల్లో మొదట్లో ఒక షైర్ల కంపెనీలో ఎకౌంటెంటుగా ఉండేవాడిని. నాంపల్లిలో ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉంటూండేవాడిని నాకు నా పనేదో తప్ప యింకొక విషయంలో ధ్యాస ఉండేదికాదు. నా ఇరుగు పొరుగులు ఎవరోకూడా నాకు తెలియదు. ఒకరోజున యధా ప్రకారం మా ఆఫీసునుండి సాయంకాలం నడుచుకుంటూ యింటికి వస్తున్నాను. మధ్య త్రోవలో ఒక చిన్న కుర్రవాడు—బహుశా అయిదారేళ్లు ఉండవచ్చు—ఒక గట్టుమీద కూర్చొని ఏడుస్తున్నాడు. 'ఎందు కేడుస్తున్నావబ్బా'యని దగ్గరగా వెళ్ళి అడిగాను.

"అమ్మ కావాలి" అన్నాడు ఏడుస్తూ. బహుశా దారి తప్పాడనుకున్నాను. 'మీ యిల్లెక్కడ బాబూ' అనిఅడిగాను అబ్బాయినిఎత్తుకుంటూ. 'మా యిల్లు అమ్మదగ్గర' అన్నాడు అమాయికంగా. 'మీ అమ్మ పేరేమి' టని అడిగాను. 'సరోజిని' అన్నాడు. ఇంతవరకు ఆ అబ్బాయిని గూర్చి తెలుసుకోలేక పోయాను. 'మీ స్కూలు ఏది' అని అడిగాను.

'అలెన్ ప్రైమరీస్కూలు'అన్నాడు ముద్దుగా. వెంటనే అతన్ని ఎత్తుకొని వాళ్ళ స్కూలుకి తీసుకొని వెళ్లాను. అప్పటికే సాయంకాలం 6-30 గం. దాటింది. అయినా ఏదో రాసుకుంటున్నాడు స్కూలు గుమాస్తా.

'ఈ అబ్బాయి మీ స్కూలులోనే చదువుతున్నాడా' అని అడిగాను.

గుమాస్తా దగ్గరగా వచ్చి అబ్బాయినిచూచి 'వీడు విఠల్. డాక్టర్ సరోజినిగారి అబ్బాయి. వీడికోసం ఆమె యిందాక ఫోనుచేశారుకూడాను' అన్నాడు.

ఆ గుమాస్తాదగ్గర డాక్టరు సరోజిని గారి ఇంటిఎడ్రెసు రాయించి తీసుకున్నాను.

డా. సరోజిని. ఈపేరు ఎక్కడో విన్నాను. కాని గుర్తురాలేదు. కాగితం మీది ఎడ్రసుతీసి చూచాను. మా యింటిప్రక్క యిల్లే! వెంటనే సైకిలు రిక్షాలో వారింటికి బయలుదేరాను.


పాపం, ఆమె ఇంటిబయటే కాచుకొని ఉంది. కొడుకుని చూడగానే ఆమెప్రాణం లేచివచ్చింది. ముద్దుల వర్షం కురిపించింది విఠల్ని ఎత్తుకుంటూ. ఈ లోగా నేను రిక్షావాడికి డబ్బులిచ్చి పంపించేశాను.

తనివితీరా ముద్దులాడి, తరువాత నన్నుచూచి "చాలా థాంక్సండీ. వీ డేమయాడో అని ఇందాకటినుండి భయపడ్డాను. రోజూ మా డ్రయివరు వీడిని పికప్ చేసుకుంటాడు స్కూలు

దగ్గర. ఈ రోజు ఆ డ్రయివరు రాలేదు. నాకా డ్రయివింగురాదు. అబ్బాయిని స్కూలు దగ్గరే ఉండమని, నేను రిక్షాలో వస్తున్నానని ఫోనుచేశాను. కాని అప్పటికే బయలుదేరిపోయాడని చెప్పారు. ఇందాకే పోలీసు రిపోర్టు కూడా ఇచ్చాను...ఓ .సారీ...మిమ్మల్ని బయట నిలబెట్టే మాట్లాడుతున్నాను. రండి. లోపలకురండి" అని ఆహ్వానించింది.

"ఫరవా లేదండి.... వెళ్తాను" అన్నాను.

"వీల్లేదు లోపలకు వచ్చి కాఫీ త్రాగి వెళ్ళవలసిందే" అని ఆర్డరు వేసిందామె డాక్టరు రోగికి చెప్పినట్టు. చేసేదిలేక ఆమె వెనుకే లోపలకు వెళ్ళాను. సోఫాలో కూర్చున్నాను. అక్కడ టేబిలు మీది పుస్తకాలు తిరగేశాను. అయిదు నిమిషాలలో ఆమె కాఫీ తీసుకొని వచ్చింది. నాకు తీరని మొహమాటం. మాట్లాడకుండా కాఫీ త్రాగుతూ కూర్చున్నాను. కొంతసేపటికి ఆమే చొరవ చేసుకొని "మీ పేరేమిటండీ"అని అడిగింది. "శంకర్" అన్నాను ముక్తసరిగా. ఈసారికూడా ఆమే "మీరుండేదెక్కడ?" అని అడిగింది. "ఈ ప్రక్క నేనండి" అన్నాను. "ఓ! అయితే మీరు మా 'నెయిబర్స' న్నమాట. వెరీగుడ్!" అందామె నేను యింకా మౌనంగా కూర్చున్నాను.



"ఏమమ్మా ముద్దాయి మిమ్మ బలవంతంగా ముద్దుపెట్టుకున్నాడని చెప్తున్నారే అప్పుడు మీరేం చేశారు?"
"మీరిప్పుడు పెట్టుకు చూడండి స్వయంగా మీకే తెలుస్తుంది."

మళ్ళీ ఇంకో ప్రశ్న అడిగిందామె "మీ రెక్కడ పని చేస్తున్నార" ని. "యూసఫ్ రబ్బరు కంపెనీలో" అన్నాను. ఏదో చెప్పడం మరచిపోయానేమో అనిపించింది. ఆఁ, ఎకౌంటెంటు పని అని చెప్పడం మరచిపోయాను. ఆ మాటకూడా చెప్పేశాను. బహుశా ఇంక యిప్పుడు ఆమెను ఏవయినా ప్రశ్నలు అడగవలసిన వంతు నాదేమోననిపించింది.

"మీరు ఎక్కడయినా హాస్పిటలులో ఉన్నారా" అని తడబడుతూ అడిగాను.

"అవునండి, జనరలు హాస్పిటలు డాక్టర్ని. మావారుకూడా అక్కడే కేన్సరు స్పెషలిస్టుగా ఉండేవారు.

మొన్ననే రెండువారాలక్రితం ఇంకా హైయరుకోర్సు స్పెషలయిజు చేయడానికి ఇంగ్లండు వెళ్ళారు. రెండేళ్ళు అక్కడుండాలి" అందామె.

ఇంకా కొంతసేపు మాట్లాడిన తరువాత రూముకి వచ్చేశాను. ఆ తరువాత మెల్లిగా ఆమెతో నాకు పరిచయం అయింది. ప్రతి రోజూ సాయంత్రం వారింటికి పోయి కొంతసేపు కూర్చొనడం అలవాటయింది. పండగ రోజుల్లోనూ, సెలవు దినాలలోనూ వారింట్లోనే భోజనం చేసేవాడిని కూడాను.

ఇలాగ రెండు మూడు మాసాలు గడిచాయి. ఒకరోజు సాయంకాలం యథాప్రకారంగా వాళ్ళ యింటికి వెళ్లి రేడియోపెట్టి కూర్చున్నాను. ఇంతలో ఆమె అక్కడకు వచ్చింది. కొంతసేపు మాట్లాడినతరువాత ఆమె "అన్నట్టు శంకర్, మీకు రేపు ఆఫీసు లీవుకదూ" అని అడిగింది. ఆమర్నాడు మాకు సెలవు. ఆ మాట ఆమెతో చెప్పాను. "అయితే మీరో సహాయం చేయాలి. రేపు మా ఆడబిడ్డ లక్ష్మి కాకినాడనుంచి వస్తుంది. మీరు ఆమెను స్టేషనులో కలుసుకొని ఇంటికి తీసుకురావాలి" అంది. నా కామె ఎవరో తెలియదు. ఎలా వుంటుందోకూడా తెలియదు. వెంటనే డాక్టర్ సరోజినితో చెప్పాను "మీరుకూడా రావచ్చునుగా" అని, ఆమెకు ఏదో ముఖ్యమయిన కేసుందట అంచేత నేను వెళ్ళక తప్పలేదు.

సరోజిని చెప్పిన ఆనవాళ్లనుబట్టి, తెల్లగా, సన్నగా, రెండు జడలు వేసుకొని తెల్లచీరకట్టిన లక్ష్మిని ఇట్టే గుర్తుపట్టాను. వయసు 20 సంవత్సరాలుండవచ్చు. "మీరేనా లక్ష్మిగారు?" అని అడిగాను జంకుతూ. "అవును. ఎందుకూ?" అంది లక్ష్మి కొంచెం ఆశ్చర్యపోతూ.

"నాపేరు శంకర్. మీ అన్నగారి భార్య డాక్టరు సరోజినిగారు పంపారు. మిమ్మల్ని ఇంటికి తీసుకురమ్మన్నారు" అన్నాను. ఆమె ముఖాన చిరుకోపం గోచరించింది. "మా వదిన ఎందుకు రాలేదు?" అని అడిగింది చిరాగ్గా.

"ఆమెకు ఏదో అర్జంటు కేసుంది. అందుకే నన్ను పంపింది. రండి. బయట కారు సిద్ధంగా ఉంది" అన్నాడు.

"ఎవరి కారు?" అంది లక్ష్మి. ఆమె ప్రశ్నలు నాకు కొంచెం కటువుగానే వినిపించాయి. బహుశా ఆమె మాట తీరే అంత అనుకున్నాను. "మీ వదినగారి కారే" అన్నాను. మౌనంగా నాతో వచ్చి కారెక్కి కూర్చుంది. ఇల్లు చేరుకున్నాం. ఇంటి దగ్గర సరోజిని మా కోసం ఎదురుచూస్తోంది. అందరికీ కాఫీ లందించింది. లక్ష్మి

కొంచెం కుదుటపడింది. నేను నా రూముకి చేరుకున్నాను.

ఇది జరిగిన వారానికల్లా నేను మైర్లకంపెనీ ఉద్యోగం మానేశాను. ఈ బేంకిలో చేరాను. మంచి ఉద్యోగం. సరోజినీదేవి ఎంతో సంతోషించింది. నాకు పెద్ద ఉద్యోగం దొరికినందుకు ఆమెకు పార్టీ ఇవ్వాలంది, సరేనని ఆ సాయంత్రం నేను, సరోజిని రిట్జి హోటలులో కలుసుకున్నాం. ఆమె లక్ష్మిని గురించి మాటల సందర్భంలో ఎన్నో చెప్పింది.

లక్ష్మి సరోజినికి ఆడబిడ్డ. పాపం ఆమెకు 14వ ఏటే వివాహం చేశారు. వివాహం జరిగిన మూడు మాసాలలోనే భర్త మరణించాడు. సంసార సుఖం అంటే ఏదో తెలియకనే ఆమెకు వైధవ్యం లభించింది. ఎంతో దురదృష్టవంతురాలు. తలితండ్రులు మళ్లీ ఆమెకు వివాహం తలపెట్టలేదు. పుట్టింట కూడా లక్ష్మికి సరియైన ఆదరణ లభించలేదు. అందువల్లే సరోజిని లక్ష్మిని తన యింటికి ఆహ్వానించింది. ఆదరిస్తోంది.

ఈ కథ విన్నతరువాత నాకు లక్ష్మి పైన జాలి కలిగింది. ఆమె మనస్సుని ఏ విధంగానూ కష్టపెట్టకూడదని నిశ్చయించాను. సాయంకాలం ఆ రోజున ఆలస్యంగా యిల్లు చేరుకున్నాం. లక్ష్మి



"అరే, అరే! శోభనరావు? ఎన్నాళ్ళకు కనపడ్డావు?"

కోసం విఠల్ కోసం తెచ్చిన మిఠాయి పొట్లాలు వారికిచ్చాను. ఆ రాత్రి అక్కడే భోజనం చేశాను.

అది మొదలు ప్రతి సాయంత్రం తప్పక సరోజిని ఇంటికి వెళ్ళేవాడిని. ఆమె లేకపోయినా లక్ష్మితో చనువుగా మాట్లాడేవాడిని. లక్ష్మికి నవల పుస్తకాలు ఇష్టం. అప్పుడప్పుడూ నవలలు కొని ఇస్తూండేవాడిని.

ఒకరోజున సాయంకాలం యథాప్రకారం వారింటికి వెళ్ళాను. సరోజిని హాస్పిటలునుండి రాలేదు. విఠల్ ఆడుకోడానికి వెళ్ళాడు. నేను రేడియో ముందు కూర్చొని ఉండగా లక్ష్మి వచ్చింది. "ఈ రోజున నాకేం తెచ్చారు?" అని అడిగింది. "కొత్త నవలలు ఇంకా ఏదీ రాలేదు లక్ష్మి"

అన్నాను మామూలు ధోరణిలో. "కాఫీ త్రాగుతారా ?" అని ప్రశ్నించింది. "ఇప్పుడే తాగా" అన్నాను. "ఏవండీ, మిమ్మల్ని ఒకమాట అడగాలనుకున్నాను. నిజంగా జవాబు చెప్పాలి. నేను మీ దృష్టికి ఎలా కనిపిస్తున్నాను?" ఈ మాటలోని అంతరార్థం వెంటనే తెలుసుకోలేకపోయాను. "మామూలుగానే" అన్నాను. ఆమెకు ఆ సమాధానం తృప్తి కలిగించలేదు. దగ్గరగావచ్చింది. "అది కాదు నేను అడిగేది. మీకు నామీద...." అంటూ సిగ్గు పడింది. ఇప్పటికి అర్థమయింది ఆమె మాటల అర్థం. "లక్ష్మి ఏమిటిది? నాకా ఉద్దేశ్యం ఎప్పుడూ లేదు" అన్నాను. ఆమె ప్రశ్నకది సమాధానం కాదు. కాని ఆమె తరువాత వేయబోయే ప్రశ్నలకు ఏకైక సమాధానం. ఈ మాటకు ఆమెకు కోపం వచ్చింది. ధుమ ధుమ లాడుతూ కంటతడితో లోపలకు వెళ్ళిపోయింది. అనవసరంగా ఆమె మనస్సు నొప్పించానే అనిపించింది. వెంటనే ఇంటికి నడిచాను.

నాలుగయిదు రోజుల వరకూ వారింటికి వెళ్ళలేదు. సరోజిని కబురు చేసింది. ధైర్యం చేసుకొని వెళ్ళాను. హాలులో సోఫాలో సరోజిని విఠల్‌కి టిఫినిస్తూ కూర్చుంది. లక్ష్మి లేదు. నేను వెళ్లగానే విఠల్ "మామయ్యా!" అంటూ ఎగిరి గంతేశాడు. సరోజిని "ఏవండోయ్! దారి తప్పి వచ్చారా! అంది. నాకేం సమాధానం చెప్పాలో తెలియలేదు. "మీరు రోజూ రాకపోతే మా యిల్లు చిన్నబోతుంది. మీకు ఏదయినా కష్టం కలిగిందా" అని అడిగిందామె. "ఏంలేదు. ఊరికేనే" అన్నాను. మళ్ళీ ఆ రోజునుండి యథాప్రకారంగా వారింటికి వెడుతుండేవాడిని. లక్ష్మి నాతో ఎక్కువగా మాట్లాడేది కాదు. నేను సరోజినీదేవితో మాట్లాడటంకూడా ఆమెకు నచ్చలేదు. వారిద్దరి మధ్య కూడా అంతగా పొత్తు లేదని కూడా గ్రహించాను. నావలన వారిద్దరూ మనస్పర్థలతో మసలటం నాకు బాధ కలిగించింది.

ఈ విధంగా ఏడెనిమిది నెలలు గడిచాయి. నాకీ వూరు ట్రాన్స్‌ఫర్ ఆర్డరు వచ్చింది. అది చూచి సరోజిని దుఃఖించింది. ఉద్యోగం మానేయమంది. వేరే ఉద్యోగం ఇప్పిస్తానంది. కాని నేను మద్రాసు వచ్చేయాలనే నిశ్చయించాను. ఆ రోజు శుక్రవారం సాయంత్రం ఎక్స్‌ప్రెస్‌కి బయలుదేరాను. స్టేషనుకి సరోజిని, విఠల్ కూడా వచ్చారు. పాపం సరోజినీదేవి ఆప్తబంధువుని వదలలేక ఏడ్చినట్టు ఏడ్చింది. మా యిద్దరికీ ఎందుకో ఆ అనురాగం, అభిమానం ఈ కొద్ది కాలపు పరిచయంలోనే కలిగాయి. ఆమెను

నేను బాగా అర్థం చేసుకున్నాను. రైలు కదిలి ఇక్కడికి చేరుకున్నంతవరకూ నాకు ఇదే ఆలోచన.

నేను ఇంతవరకూ చెప్పింది రమేష్ విన్నాడు. 'అవును. ఇప్పుడేమయింది' అని అడిగాడు.

నేను మళ్లీ ప్రారంభించాను. నేను ఇక్కడకు వచ్చి సంవత్సరం అయింది. ఈ సంవత్సరంలో అనేక ఉత్తరాలు నేనామెకు రాశాను కాని నాకు సమాధానం రాలేదు. ఇదుగో నిన్న ఈ జాబు వచ్చింది. చూడు "అంటూ అందించాను. రమేష్ బిగ్గరగా చదవనారంభించాడు.

"తమ్ముడు శంకర్ కి,

నీవు వ్రాసిన జాబులన్నీ అందాయి. కాని సమాధానం వ్రాయడానికికూడా నాకు స్వేచ్ఛలేని పరిస్థితి ఏర్పడింది.



నిన్ను ఆ రోజు స్టేషనులో దిగపెట్టి ఇల్లు చేరుకునేటప్పటికి మావారు ఇంగ్లండునుంచి వచ్చి ఉన్నారు. ఆయన వస్తున్నట్టు టెలిగ్రాం పంపారట. నాకా టెలిగ్రాం అందలేదు. ఆయనకా విషయం తెలియదు. నామీద తీరని కోపం వచ్చింది. అదికాక నీ గురించి లేనిపోని మాటలు ఎవరో ఆయనకు చెప్పారు. ఆయనకు నామీద ఎంతో అనుమానం. ఆ రోజు నుండి ఆయన నాతో మాటలు కూడా మానేశాడు. అది నా దురదృష్టం. కొద్ది రోజుల క్రితం లక్ష్మి చదివే నవలలో ఒక నవల కాగితాల మధ్య ఆయన పంపిన టెలిగ్రాం కనుపించింది. లక్ష్మి నన్నెందుకీ విధంగా నాశనం చేయ దలచుకుందో నాకు తెలియదు. నే నామెకు ఏ విషయంలోనూ అన్యాయం చేయలేదు. పైగా ఆమెకు ముందు జీవితం అంతా వెలుగు చూపాలని ప్రయత్నించాను. నేనా టెలిగ్రాం విషయం ఎవరికీ చెప్పలేదు.

పది పదిహేను రోజులుగా ఆయన ప్రవర్తన మరీ విపరీతంగా ఉంది. నే నుండే ఇంట్లో ఉండటానికి ఇష్టం లేదని కూడా లక్ష్మితో అన్నారట. బహుశా ఈ ఇంట్లో ఈ లోకంలో నాకింక స్థానంలేదు. నీతో ఎన్నో విషయాలు మాట్లాడాలని ఉంది కాని వ్యవధిలేదు. బహుశా ఇదే నా ఆఖరి జాబు.

మీ అక్క
సరోజిని.

ఈ జాబు చదివి రమేష్ కూడా కంటతడి పెట్టాడు. "శంకర్, నువ్వొక పనిచెయ్. వెంటనే బయలుదేరి హైదరాబాదు వెళ్లు విషయమంతా ఆమె భర్తకు తెలియపరచు. ఇంకా ఆలస్యం చేస్తే ఆమె ఆత్మహత్యకూడా చేసుకోవచ్చు. "అని సలహా, ఇచ్చాడు. నిజమే! ఆమెను ఎలాగయినా కాపాడాలి. వెంటనే వెళ్లాలి. నావల్ల ఆమె బలికాకూడదు. అని నిశ్చయించుకున్నాను. మర్నాడు రైలులో హైదరాబాదు చేరుకున్నాను. నాంపల్లిలో ఆమె ఇంటిని చేరుకున్నాను, ఇంటి తలుపు మూసిఉంది. తలుపు తట్టాను. డా॥ మురళీధర్, సరోజిని భర్త తలుపు తెరిచారు. "నమస్కారం" అన్నాను. "నమస్కారం'' అని లోనకు ఆహ్వానించాడు.

"నా పేరు 'శంకర్', మదరాసు నుండి వచ్చాను. సరోజినీదేవిగారున్నారండి" అని అడిగాను.

మురళీధర్ ఒణికే కంఠంతో "ఇంకెక్కడి సరోజినండి! ఆమెను నిందించి పొట్టను పెట్టుకున్నాను" అంటూ బావురుమని ఏడ్చాడు. నా

గుండెలో చెప్పలేని ఆవేదన కలిగింది. అనుకున్నంతా జరిగింది. నా నోట మాట రాలేదు.

మురళీధర్ "మిమ్మల్ని, ఆమెను అపార్థం చేసుకున్నాను. అనుమానించాను. నిందించాను. సంవత్సరం పాటు నానా బాధలు పెట్టాను. ఇదుగో నిన్న ఈ జాబు వ్రాసి హాస్పిటలులో విషం త్రాగి చనిపోయింది.

అప్రయత్నంగా ఆ జాబుని అందుకున్నాను. చదివాను.

"మీకు అనుమానం కలిగేటట్టు నడచుకున్నాను. క్షమించండి. శంకర్‌ని నేనెప్పుడూ సోదరుడిగానే ప్రేమించాను. ఇది నిజం. మీరు పంపిన టెలిగ్రాం నాకందలేదు. మీ చెల్లెలు లక్ష్మి టెలిగ్రాంని మరుగు పరచింది.

మీరు నన్ను అనుమానించటంలో మీతప్పేమీ లేదు. అంతా నా దురదృష్టం. ఇంక మన యింటగాని, ఈ లోకంలోగాని నేను ఉండతగను.

ఆఖరిసారిగా ఒక్కమాట. లక్ష్మికి నేనెప్పుడూ సహాయపడాలనే యోచించాను. ఇప్పుడుకూడా లక్ష్మికి ఒక ఉపకారం చేయాలనుకుంటున్నాను. నా కోరిక నా శంకర్‌కి చెప్పి లక్ష్మిని వివాహం చేసుకోమని కబురు పంపండి. అతను తప్పక అంగీకరిస్తాడు. నా మాట కాదనడు. విశాల్‌ని వారికిచ్చి పెంచమనండి.

జీవితాంతం మీతో ఉండి కష్టసుఖాలు పంచుకోవాలనుకున్నాను. కాని భగవంతుడు వేరే విధంగా చేశాడు.

మీ

సరోజిని

ఈ జాబు చదవగానే నాకు ముచ్చెమటలు పోశాయి. కళ్లు తిరిగి నట్టయింది. తెప్పరిల్లి చూచాను. ఎదురుగా లక్ష్మి ఏడుస్తూ నిలుచుంది. ★

---

## సినిమాక్విజ్ - జవాబులు

1. అర్థాంగి
2. పెళ్లిమీద పెళ్లి
3. భార్యాభర్తలు
4. వెలుగు నీడలు